ముత్యాలమ్మకు బోనం సమర్పణ

మహబూబాబాద్ రూరల్: శ్రావణ మాసం బోనాల పండుగ సందర్భంగా ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి దంపతులు, కుమార్తె తేజస్వీ, కుమారుడు సూర్యచంద్ర బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని కోర్టు వద్ద ఉన్న ముత్యాలమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, సౌజన్య, వైస్ చైర్మన్ ఫరీద్, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: శ్రావణమాసం పురస్కరించుకొని గార్లలోని అంబేడ్కర్‌నగర్‌లో మహిళలు బోనాల పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తొలుత మేళ తాళాల నడుమ మహిళలు బోనాలు ఎత్తుకొని గార్ల పురవీధుల్లో పూనకాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించి ముత్యాలమ్మ గుడికి చేరుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో ఉండాలని ముత్యాలమ్మ తల్లిని వేడుకున్నారు. ముత్యాలమ్మ గుడి వద్ద భక్తులు దేవతకు జంతుబలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సర్పంచ్ అజ్మీర బస్సీలాల్ సిబ్బంది మార్కెట్‌యార్డులో గల ముత్యాలమ్మ గుడి వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు.

గూడూరు: మండలంలోని గోవిందాపురంలో బుధవారం ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మానుకోటకు చెందిన జానపద కళాకారులు గ్రామ దేవతల వేషధారణలతో పూనకాలు ఊగుతూ సందడి చేయడం పలువురిని అలరించారు. సర్పంచ్ మూడు మోహన్ నాయక్ ఏర్పాట్లు చేశారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో బుధవారం ముత్యాలమ్మకు ప్రజలు బోనాలు సమర్పించారు.


మహబూబాబాద్ రూరల్: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు


గూడూరు: గోవిందాపురంలో వేషధారణలో కళాకారులు


మహబూబాబాద్ రూరల్: బోనాలతో వెళ్తున్న భక్తులు


దంతాలపల్లిలో..


గార్ల: బోనాలతో వెళ్తున్న అంబేడ్కర్‌నగర్ మహిళలు

దివ్యాంగులకు భరోసా కల్పించిన కేసీఆర్

మహబూబాబాద్: దివ్యాంగులకు రూ.3016 ఉన్న పింఛన్‌ను రూ.4016కు పెంచి వారికి సీఎం కేసీఆర్ భరోసా కల్పించారని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం దివ్యాంగులకు పెంచిన పింఛన్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారన్నారు. దివ్యాంగులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, గద్దె రవి, మార్నేని వెంకన్న, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: బీఆర్ఎస్ మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం దివ్యాంగులకు ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను పెద్దముప్పారం గ్రామంలో సర్పంచ్ నూకల హిమబిందుతో కలిసి బుధవారం పంపిణీ చేశారు.

కేసముద్రం: దేశంలో ఎక్కడాలేని విధంగా దివ్యాంగులకు సీఎం కేసీఆర్ పింఛన్‌లను అందిస్తున్నారని జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో దివ్యాంగులకు పెంచిన పింఛన్ ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరు నాయక్, చిలువేరు సమ్మయ్యగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న, వల్లందాసు రవి పాల్గొన్నారు.

మరిపెడ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే దివ్యాంగులకు పెంచిన పింఛన్లను మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు కౌన్సిలర్ బాదావత్ హతీరాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాములు, వీరన్న, హుస్సేన్, సెత్రాం, రమేష్, బాల, సామ్య, తదితరులు పాల్గొన్నారు.


మహబూబాబాద్: పింఛన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

చంద్రయాన్‌-3 వీక్షించిన విద్యార్థులు


కొత్తగూడ: చంద్రయాన్‌-3 వీక్షిస్తున్న ఏకలవ్య గురుకుల విద్యార్థులు


గార్ల: ఎస్సీ బాలుర వసతి గృహంలో..


కేసముద్రం: శ్రీవివేకవర్ధినీ హై స్కూల్‌లో..


గూడూరు: మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో..

చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా భారత్ నిలిచింది. బుధవారం చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్‌-3 ల్యాండింగ్ అవుతున్న ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా వ్యాప్తంగా విద్యాలయాల్లో టీవీల్లో విద్యార్థులు వీక్షించారు. ప్రయోగం విజయవంతం కావడం సంతోషకరమని, ఇస్రో శాస్త్రవేత్తల కృషి మరువలేనిదన్నారు. - సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

చంద్రయాన్‌-3 సక్సెస్‌పై సంబురాలు



కేసముద్రం: చంద్రయాన్‌-3 ప్రయోగం విజయం సాధించడంపై బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో గోవా రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే కృష్ణ శాలకర్, బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచందర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభు వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి గాంతి వెంకట్‌రెడ్డి, వోలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

గూడూరు: మహాత్మా జ్యోతిబా పూలే, బీసీ సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండలంలోని మర్రిమిట్ట శివారు ఎంజేపీ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (ఈపీహెచ్), బీకాం (సీఏ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (బీజెడ్‌సీ)ల లో మొదటి సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన బాలికలు దరఖాస్తులను నేరుగా తమ పాఠశాలలో అందజేయాలని తెలిపారు.

హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్: ప్రజలు రోగాల బారినపడకుండా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి బట్టు చైతన్య డిమాండ్ చేశారు. పీవైఎల్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సుధీర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గణేష్, లింగస్వామి, మహేష్, విజయ్, నవీన్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా భారతి



నర్సింహులపేట: నర్సింహులపేట నూతన ఎంపీడీఓగా బానోతు భారతి బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి బదిలీపై బయ్యారానికి వెళ్లారు.

క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్



మహబూబాబాద్ రూరల్: క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ అని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి బలరాంనాయక్ హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం దరఖాస్తు చేశారు. దరఖాస్తు ఫారాన్ని మండల నాయకులతో కలిసి అందజేశారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు ఏదల్ల యాదవ్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ, ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల, చెర్లపాలెం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు చెవిటి సధాకర్, రావుల కిషన్‌రెడ్డి, వల్లపు నారాయణ పాల్గొన్నారు.

మహిళలు ఉపాధి రంగంలో రాణించాలి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు ఉపాధి రంగంలో రాణించేందుకు ఇలాంటి సేవ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి ఉషా అన్నారు. బుధవారం మండలంలోని అరిపిరాల, నాంచారీమడూరు గ్రామాల్లో కొనసాగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, మార్కెట్ మాజీ చైర్మన్ పసుమర్తి శాంత, ట్రస్ట్ కోఆర్డినేటర్ పంజా కల్పన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 29న చేపట్టనున్న చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, చంద్రమౌళి, సరస్వతి, అశోక్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ఎజెండా

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

డోర్నకల్: నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పని చేసి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పేర్కొన్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 15వార్డుల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసినందుకు ప్రజలు ఓటు వేసి దీవించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులకు పెంచిన పింఛన్‌కు సంబంధించిన రూ.2.25కోట్ల విలువైన చెక్కును దివ్యాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం, కమిషనర్ మున్వర్ అలీ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, కౌన్సిలర్లు హేమచంద్ర శేఖర్, బసిక అశోక్, బోడ అమల, భూక్యా వీరన్న, తేజావత్ సంధ్యారాణి, అంకెపాక అరుణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

నేడు రంగాచార్యులు జయంతి



చిన్నగూడూరు: తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలమైన పాత్ర పోషించిన దాశరథి రంగాచార్యులు మలిదశ తెలంగాణ ఉద్యమానికి నాంది పలికారు. రంగాచార్య 96వ జయంతిని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.. చిన్నగూడూరు (ప్రస్తుతం మండలం) గ్రామంలో వెంకటాచార్యులు వెంకటమ్మ పుణ్య దంపతులకు 24 ఆగష్టు 1928 సంవత్సరంలో దాశరథి రంగాచార్యులు జన్మించారు. వారి విద్యాభ్యాసం ఖమ్మం జిల్లాలో సాగింది. పన్నెండేళ్లకే సాహిత్యంపై మక్కువ పెంచుకుని నాడు తెలంగాణ పల్లెలో నాటి జీవన విధానాన్ని ఆయన రాసిన నవలల్లో కళ్లకు కట్టినట్లు అద్దం పట్టాయి. ఉపాధ్యాయుడిగా, గ్రంథాలయ నిర్వాహకుడిగా, సికింద్రాబాద్ పురపాలక శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తించారు. చివరకు 2015 జూన్ 8న సికింద్రాబాద్‌లో తుది శ్వాస విడిచారు. దాశరథి సోదరుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి దాశరథి సోదరులకు సముచిత స్థానం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేదలపై భారం మోపడం సరికాదు


సమస్యను అధికారులకు వివరిస్తున్న సీతారాం నాయక్

మహబూబాబాద్: జీఓ 59 పేరుతో పేదలపై లక్షల భారం మోపడం సరికాదని, నిర్మాణం చేసుకున్న ఇళ్లను అమ్మినా అంతా డబ్బు రాదని ఆ విషయంలో ప్రభుత్వం ఆలోచించి పేదలకు న్యాయం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. జీఓ 59లో దరఖాస్తు చేసుకుని డబ్బులు చెల్లించిన ఇళ్ల కూల్చివేసేందుకు రెవెన్యూ, మున్సిపల్ , పోలీసులు , సంబంధిత అధికారులు మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని గిరిప్రసాద్‌నగర్ కాలనీతోపాటు ఎల్‌బీజీ నగర్ కాలనీ, హన్మంతరావు నగర్ కాలనీలో బుధవారం ఇళ్లను కూల్చేందుకు జేసీబీతో వెళ్లారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు అక్కడికి చేరుకుని లక్షల్లో డబ్బులు చెల్లించే స్థోమత లేదని అధికారులకు నాయకులు వివరించారు. జేసీబీని అడ్డుకున్నారు. ఆర్డీఓ అలివేలు మాట్లాడుతూ.. జీఓ నిబంధనల ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. దరఖాస్తుదారులు సహకరించి డబ్బులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రావుల రాజు, తహసీల్దార్ ఇమ్మానియల్, ఆర్ఐ కృష్ణప్రసాద్, టీపీఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొజెక్టర్‌తో ఆకర్షణీయమైన విద్యాబోధన

కురవి: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా బోధన చేయడం ద్వారా ఆకర్షితులవుతారని తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సావిత్రి సొంత ఖర్చులు రూ.25వేల విలువైన ప్రొజెక్టర్‌ను బహూకరించారు. అదే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు టై, బెల్టులు, బ్యాడ్జీలను అందజేశారు. ఈసందర్భంగా వార్డు సభ్యుడు నూతక్కి నర్సింహరావు రూ.5వేలు, ఉప సర్పంచ్ సంగెంభరత్ రూ.2వేలు, ఎస్ఎంసీ చైర్మన్ కిన్నెర ఉపేందర్ రూ.2వేలు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిన్నంభాస్కర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సావిత్రి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం.జయసాగర్, ఉపాధ్యాయులు మల్లయ్య, నిరంజన్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మీదుర్గ, రవి, సీఆర్పీ వెంకన్న పాల్గొన్నారు.


టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ

హస్తకళల శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న అధికారి ముకేష్

గార్ల: హస్తకళల శిక్షణను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని వరంగల్ హస్తకళల అధికారి ముకేష్ సూచించారు. బుధవారం గార్లలో సమర్థ్ సంప్రదాయ చేతివృత్తుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమం 2 నెలల పాటు ఉంటుందని, ప్రతీరోజు శిక్షణకు హాజరైన మహిళలకు రూ.300 స్టైఫండ్ ఇస్తామని సూచించారు. శిక్షణకు గార్ల, డోర్నకల్ మండలాలకు చెందిన 30 మంది మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎల్‌డీసీ వెంకట్, సర్పంచ్ అజ్మీర బస్సీలాల్, ఉపసర్పంచ్ కె మహేశ్వరరావు, బీఎస్ఎస్ ఫీల్డ్ మేనేజర్ సేనా, అశోక్, శిక్షకురాలు భట్టు విజయ, తదితరులు పాల్గొన్నారు.

'దళిత బంధు' వర్తింపజేయాలి

మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జెర్ల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి అక్కడి దళితులందరికీ దళిత బంధు పథకాన్ని వర్తింపజేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ అధ్యక్షుడు గోపి మధుసుదన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య, నాయకులు విజయ్, నరేష్, మల్లేశం, వెంకటయ్య, బిక్షపతి, రవి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వినతిపత్రం అందజేత

పెద్దవంగర: పెద్దవంగర మండల కేంద్రం పరిధిలోని ఎక్స్ రోడ్డు ప్రాంతాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని అనపురం రవి, ధర్మాపు యాకయ్య కోరారు. పెద్దవంగర సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మీ రామచంద్రయ్య శర్మలకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీను,నివాస్, సోమన్న, నారాయణ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దవంగర: ఉద్యోగ భద్రత కల్పించాలని సీఆర్పీలు నిరంజన్, రంగయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోస్టు కార్డుల ద్వారా సీఎం కేసీఆర్‌కు సమాచారం పంపారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. 18 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు సంతోష్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

కేసముద్రం: దివ్యాంగుల పింఛన్ ప్రభుత్వం రూ.4,116 చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండలంలోని అమీనాపురం గ్రామంలో దివ్యాంగులు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పురం రమేష్, గ్రామబీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సోలాపురపు యాకుబ్‌రెడ్డి, వార్డు సభ్యుడు అంబటి రమేష్, గుగ్గిళ్ల బ్రహ్మచారి, మేకల కొండలు, శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని బీజేపీ మండల, గ్రామాల నాయకులను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడికి బీజేపీ పిలుపులో భాగంగా ముందస్తుగా నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

నెహ్రూసెంటర్: బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వచ్చిన మహిళపై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి బుధవారం తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితబంధు ఐక్య సాధన వేదిక నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పోలెపంగు రవి, ఉపాధ్యక్షుడిగా గోపి రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మల్లేశం, సహాయ కార్యదర్శిగా మల్లెపంగు రమేష్, కోశాధికారిగా వడ్లకొండ వెంకటమల్లు, ప్రచారకర్తలుగా విజయ్, మిషన్ వెంకటయ్య, బిక్షపతి, రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కొత్తగూడ: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రముఖ పాత్ర పోషించాలని రిసోర్స్ పర్సన్ చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో కొత్తగూడ, గంగారం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. అనాథ పిల్లలపై ఒక రకమైన నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, రామలక్ష్మి, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శ్రావ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

తొర్రూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల రాంరెడ్డి తెలిపారు. గుర్తూరు గ్రామ అధ్యక్షుడిగా కాసర్ల రంగయ్య, ప్రధాన కార్యదర్శిగా ఈదునూరి మధు, గుడిబండ తండా అధ్యక్షుడిగా జితేందర్, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు వెంకన్న, పత్తేపురం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా అశోక్, ఇట్టె రెడ్డిలు ఎన్నికయ్యారు.

ప్రెస్‌క్లబ్ మండల కమిటీ ఎన్నిక

నర్సింహులపేట: నర్సింహులపేట మండల ప్రెస్‌క్లబ్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండబత్తిని రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కొల యాకయ్య, సహాయ కార్యదర్శిగా సంతోష్, ఉపాధ్యక్షుడిగా కల్లెడ మధు, కొమిర యాకయ్య ఎన్నికయ్యారు.

రైళ్ల హాల్టింగ్ పునరుద్ధరించాలి

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో పద్మావతి, షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను పునరుద్ధరించాలంటూ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బుధవారం రైల్వే జీఎం, డీఆర్ఎంలను ఫోన్‌లో కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

గూడూరు: తండాలను జీపీలుగా మార్చినా సమస్యలన్నీ అలాగే ఉన్నాయని, తండాలలో తాగునీరు, సైడ్ డ్రైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు బానోతు సురేష్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బోడ హరిలాల్ అన్నారు. మండలంలోని అప్పరాజ్‌పల్లి శివారు అఖ్యాతండాను బుధవారం వారు సందర్శించారు. ఈసందర్భంగా తండావాసులు వారికి జీపీ పాలకులు ఎవరూ తమ సమస్యలను పరిష్కరించడంలేదని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో అరుణ, భద్రి, కిషన్, విజయ, శ్రీను, రీటా పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

పెద్దవంగర: గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి ప్రభాకర్ కోరారు. బుధవారం మండలంలోని పోచంపల్లి, అవుతాపురం గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఓఎస్ ఉప్పలయ్య, గోపాల మిత్ర వెంకన్న, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడడం అభినందనీయం

గూడూరు: సామాజిక సేవా దృక్పథంతో ఏర్పడిన లయన్స్ క్లబ్ విద్యాభివృద్ధికి పాటుపడడం అభినందనీయమని సర్పంచ్ మాధవపెద్ది విజయశ్రీ అన్నారు. మండలంలోని అప్పరాజ్‌పల్లి యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భీముడు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, మాలె కాశీనాద్, శ్రీనివాస్, విష్ణువర్ధన్, చందర్‌నాయక్, ఎల్లయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కురవి: ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన బండి రంగయ్య అనే భక్తుడు రచించిన భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి చరిత్ర, స్థల పురాణం పుస్తకాన్ని వార్డు సభ్యుడు నూతక్కి నర్సింహరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆవిష్కకర్త నర్సింహారావును రచయిత కుటుంబ సభ్యులు సత్కరించారు. పుస్తకాలను భక్తులకు అందచేశారు.

పనులు పూర్తి చేయాలి

మహబూబాబాద్: మిషన్‌భగీరథ పనులు పూర్తి చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులోని కొంపల్లి గోపాల్‌రావు నగర్ కాలనీలో తాళం వేసిన ఉన్న నీటి సరఫరా టాపింగ్ పాయింట్‌ను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ.. పనులు పూర్తి కాకుండా టాపింగ్ పాయింట్‌కు తాళాలు వేయడం వలన పలు కాలనీలు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న కాలనీవాసులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల మద్దతు ఉంది

నెల్లికుదురు: కమ్యూనిస్టుల మద్దతు తనకే ఉందని బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎమ్మెల్యే రెబల్ అభ్యర్థిగా భరిలో నిలుస్తున్న తెలంగాణ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నాయకుడనని, కేసీఆర్ అభిమానినని, కేసీఆర్ స్ఫూర్తితో అవసరమైతే రెండు చోట్ల పోటీ చేసి గెలిచి కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు. కొంతమంది అక్రమార్కులకు బీఆర్ఎస్ నుంచి పార్టీ టిక్కెట్లు రావడం విచారకరమన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

గార్ల: పర్యావరణం పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు సూచించారు. ఈమేరకు బుధవారం కళాశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో చిల్డ్రన్ మూమెంట్ ఫర్ క్లైమేట్ జస్టిస్ పాల్ థామస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాద్‌రావు, వేముల రవీందర్, జోగ్యానాయక్, సత్యనారాయణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

బయ్యారం: మండలంలోని వెంకట్రాంపురంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బిందు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు. శంకుస్థాపనకు తనను ఆహ్వానించకపోవడం సరైంది కాదని సర్పంచ్ నీలమ్మరామునాయక్ పేర్కొన్నారు.